సాక్షి
ఒడిశా
గురువారం । 4 । జూలై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,51,091లు వచ్చాయని అధికారులు తెలిపారు.



నూతన సీఈవోగా తిరుమల నాయక్

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా డాక్టర్ ఎస్.తిరుమల నాయక్ నియమితులయ్యారు.

- 8లో.




మొక్కలతోనే జీవకోటికి మనుగడ

మొక్కలతోనే జీవకోటికి మనుగడ సాధ్యమవుతోందని నబరంగ్‌పూర్ కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర అన్నారు.

- 8లో.

మిస్టరీ వీడేదెన్నడో..?

- రత్న భాండాగారం తెరవడంపై ఉత్కంఠ
- ఈనెల 8న తెరవనున్నట్లు ఊహాగానాలు
- వదంతులు నమ్మొద్దు: న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్



భువనేశ్వర్:

పూరీ శ్రీజగన్నాథ దేవాలయంలోని రత్న భాండాగారం మిస్టరీ వీడడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొని ఉంది. ఇటీవల రాష్ట్రంలో తొలిసారి భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో స్వామి భక్తుల్లో ప్రధానంగా రాష్ట్ర ప్రజల్లో రత్న భాండాగారం తెరవడం, ఆభరణాలు ఇతరేతర సొత్తు లెక్కింపుపై మరింత ఆరాటం పెరిగింది. న్యాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నుంచి పృథ్వీరాజ్ హరిచందన్ రత్న భాండాగారం అతి త్వరలోనే తెరవడం తథ్యమని బాహాటంగా ప్రకటిస్తున్నారు. ఈ ప్రకటనతో రేపో మాపో శ్రీజగన్నాథుని ఖజానా తెరిచి సొత్తు వివరాలు బయట పెడతారని రాష్ట్ర ప్రజానీకం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రథయాత్ర పురస్కరించుకుని శ్రీమందిరంలో రత్న భాండాగారం తెరవనున్నట్లు ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈనెల 8న రత్న భాండాగారం తెరవనున్నట్లు సమాచారం ప్రచారమవుతోంది. రథయాత్ర ముగిసేలోగా రత్న భాండాగారం తెరిచి లెక్కింపు పూర్తి చేస్తారని వదంతులు వ్యాపించాయి.

అంతా ఉత్తిదే

రత్న భాండాగారం ఈనెల 8న తెరవనున్నట్లు వార్త రాష్ట్రవ్యాప్తంగా దావాణంలా వ్యాపించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఉలికిపాటుకు గురైంది. శ్రీజగన్నాథుని రత్న భాండాగారం తెరవడంపై సాంఘిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న వదంతులను ఎంత మాత్రం నమ్మవద్దని మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ బుధవారం ప్రకటించారు. ఏదైనా రాష్ట్ర ప్రభుత్వమే అధికారకంగా ప్రకటిస్తుందని పేర్కొన్నారు.

రంగం సిద్ధం



శ్రీమందిరంలో రత్న భాండాగారం తెరవడం తథ్యం. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ఖరారు చేసినట్లు మంత్రి పృథ్వీరాజ్ తెలిపారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఇటీవల జరిగిన రథయాత్ర రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ సమావేశం పురస్కరించుకుని పూరీ సందర్శించిన సందర్భంగా ధ్రువీకరించారు. అయితే ఈ సన్నాహం కార్యాచరణపై స్పష్టమైన విధి విధానాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ కార్యాచరణ ప్రాథమికంగా పూర్తయ్యింది. వాస్తవ కార్యాచరణలో సాధ్యాసాధ్యాలను నిపుణులు పరిశీలిస్తున్నారు. కార్యాచరణ తుది మెరుగులు దిద్దుకుంటుంది. త్వరలో ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. సమావేశంలో రత్న భాండాగారం తెరిచే మార్గదర్శకాలు ఖరారవుతాయి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక రత్న భాండాగారం తెరిచే తేదీలు ఇతరేతర అనుబంధ కార్యక్రమాల వివరాలను ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తుందన్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఈ వివరాలను ప్రకటించేందుకు సన్నాహాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయని మంత్రి పేర్కొన్నారు.

కమిటీ పూరీ సందర్శన



ఇదిలా ఉండగా రత్న భాండాగారం తెరవడంపై జస్టిస్ అరిజిత్ పసాయత్ అధ్యక్షతన ఏర్పాటైన 12 మంది సభ్యుల తనిఖీ కమిటీ గురువారం రాజధాని చేరనుంది. మర్నాడు శుక్రవారం పూరీ చేరుకొని రత్న భాండాగారం తెరిచే దిశలో ఉన్నత స్థాయి సమావేశానికి సన్నద్ధత వ్యక్తం చేసినట్లు అనధికారిక సమాచారం. ఈ కమిటీ ఈనెల 27వ తేదీ వరకు నిరవధికంగా పూరీలో ఉంటుందని తెలుస్తోంది. ఈ కమిటీలో డాక్టర్ రమాకాంత పండా, డాక్టర్ బిధిభూషణ్ సామల్, ఎ.కె.సాబత్, పూరీ జిల్లా కలెక్టర్, శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి (సీఏఓ), పూరీ గజపతి మహారాజా ప్రతినిధి, భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ప్రతినిధి, సేవాయత్‌లు దుర్గా ప్రసాద్ దాస్ మహాపాత్రో, మాధవ చంద్ర మహాపాత్రో, జగన్నాథ్ కొరొ మరియు గణేష్ మేకప్ ఇతర సభ్యులుగా ఉన్నారు.

జస్టిస్ అరిజిత్ పసాయత్ పర్యటన

రత్న భాండాగారం తనిఖీ కమిటీ చైర్మన్ జస్టిస్ అరిజిత్ పసాయత్ ఈనెల 4న రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఆయన న్యూఢిల్లీ నుంచి విమానంలో స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుని నేరుగా కటక్ తెలంగా బజారు ప్రాంతంలో తన స్వగృహం చేరి రాత్రి విశ్రమిస్తారు. మర్నాడు ఉదయం 9 గంటలకు కటక్ నుంచి పూరీ బయల్దేరుతారు. ఉదయం 11 గంటలకు పూరీ చేరుకుని హైకోర్టు అతిథి భవనంలో విడిది చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు రత్న భాండాగారం తనిఖీ కమిటీ సమావేశం అవుతుంది. శ్రీజగన్నాథుని రథయాత్ర ఆయన ప్రత్యక్షంగా తిలకిస్తారు.

లెక్కింపు ఎలా..?

రత్న భాండాగారంలో పదిల పరచిన అమూల్య రత్న సంపద లెక్కింపు సాధ్యాసాధ్యాలు ప్రశ్నగా రత్న భాండాగారం కమిటీ సమావేశమవుతుంది. సంప్రదాయ రీతిలో రత్న భాండాగారంలో లోపలి మిద్దెల తాళాలు తెరిచి లెక్కించడం కంటే, ఆధునిక వైజ్ఞానిక పద్ధతుల అవలంబనతో ఈ ప్రక్రియ చేపట్టడంపై లోగడ కమిటీ సభ్యులు ప్రతిపాదించారు. ఎండోస్కోపీ విధానంతో రత్న భాండాగారం లోపలి మిద్దెలో సొత్తు లెక్కింపు సాధ్యమనే యోచన ప్రతిపాదించారు. ఈ యోచన అమలు, కార్యాచరణపై కమిటీ అభిప్రాయం ఇంతవరకు స్పష్టం కాకపోవడం గమనార్హం.

న్యూస్‌రీల్

బీజేపీపై ఎదురుదాడి చేస్తాం

- ఎమ్మెల్యే బాహిణీపతి



కొరాపుట్: రాష్ట్రంలో బీజేపీపై ఎదురుదాడి చేస్తామని కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి హెచ్చరించారు. రాజధాని భువనేశ్వర్‌లో రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయం ఆవరణలో మీడియాతో బుధవారం మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో నిరసన చేసే హక్కు ప్రతీ రాజకీయ పార్టీకి ఉందన్నారు. కానీ బీజేపీ తన ఆందోళనలో భాగంగా ప్రదేశ్ కాంగ్రెస్ కార్యాలయంపై దాడి చేయడంపై మండిపడ్డారు. ఆ సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం దారుణమన్నారు. అంతేకాక రాష్ట్రంలోని అనేక చోట్ల కాంగ్రెస్ కార్యాలయాల ముందు బీజేపీ ఆందోళనలు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని పేర్కొన్నారు. ఈ ఘటనలపై ప్రభుత్వం స్పందించకపోతే తాము 20 వేల మంది కాంగ్రెస్ కార్యకర్తలతో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోకి చొరబడతామని హెచ్చరించారు. అప్పుడు పోలీసులు ఏం చేస్తారో చూస్తామన్నారు. రాహుల్ గాంధీ ఫ్లెక్సీ మీద పేడ జల్లిన బీజేపీ కార్యకర్తలపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రతీ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం ముందు నిరసనలు చేస్తామని పేర్కొన్నారు. బీజేడీలో ప్రజాస్వామ్య విలువలు లేవని విమర్శలు చేసిన బీజేపీ కూడా అదే బాటలో నడుస్తోందని దుయ్యబట్టారు. హిందూ మతం ముసుగులో కొందరు విధ్వంసాలు సృష్టిస్తూ మతానికి అప్రతిష్ఠ తీసుకొస్తున్నారని మండిపడ్డారు.

మాజీ ఎమ్మెల్యే ఆదిత్యా మాడీ కన్నుమూత



మల్కన్‌గిరి: మాజీ ఎమ్మెల్యే ఆదిత్యా మాడీ(50) భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం కన్నుమూశారు. ఆయన మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి రోడాగిపల్లి గ్రామానికి చెందిన కోయ తెగకు చెందిన వ్యక్తి. రాజకీయాలపై ఆసక్తితో టీచర్ వృత్తిని వదిలి 2009లో బీజేపీలో చేరారు. 2009, 2014 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చవిచూశారు. అయినా నిరాశ చెందకుండా 2019లో మరలా పోటీచేసి మల్కన్‌గిరి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారు. అయితే ఆయన గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. రెండు కిడ్నీలు పూర్తిగా పాడైపోవడంతో 2021లో ఆయన భార్య కిడ్నీ ఇవ్వగా కిడ్నీ మార్పిడి చేశారు. అయినప్పటికీ ఆరోగ్యం మెరగవ్వక చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతదేహానికి గురువారం సొంత ఊరులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆదిత్య మాడీ మృతితో జిల్లాలో విషాదఛాయలు అలముకున్నాయి.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ



బాధితురాలు అనసూయ

రాయగడ: వృద్ధురాలి మెడలో గుర్తు తెలియని దుండగులు గొలుసు దొంగతనం చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక గుండిచా మందిరానికి సమీపంలో బి.అనసూయ అనే వృద్ధురాలు పాన్‌షాప్ నిర్వహిస్తోంది. ప్రతిరోజు మాదిరిగానే బుధవారం తెల్లవారు జామున 4 గంటలకు దుకాణాన్ని తెరిచి సామన్లు సర్దుతోంది. ఇంతలో గుర్తు తెలియని ఇద్దరు దుండగులు దుకాణం వద్దకు వెళ్లి గుట్కాలు కావాలని అడిగారు. ఈ క్రమంలో ఆమె గుట్కాలు ఇస్తున్న సమయంలో అదును చూసి మహిళ మెడలో నాలుగు తులాల బంగారు గొలుసు తెంపుకొని పరారయ్యారు. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో బాధితురాలు కేకలు వేసినా ఫలితం లేకపోయింది. అనంతరం ఆమె సదరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాల ఆధారంగా దుండగులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు ఐఐసీ కేబీకే కుహరో తెలియజేశారు. ఇదిలా ఉండగా గత కొద్ది రోజులుగా పట్టణంలో దొంగతనాల జోరు మళ్లీ ఊపందుకుంది. ముఖ్యంగా కూడళ్లలో పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాల దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరామర్శ

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి ఎక్కంబ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మీనా అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, జిల్లా బీజేడీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠిలు బుధవారం పరామర్శించారు. వారితో పాటు బీజేడీ నాయకులు ఆశిష్ రంజన్ పట్నాయక్, సునీల్ సాహు, జిల్లా పరిషత్ సభ్యుడు అరుణ్ మిశ్ర తదితరులు ఉన్నారు.

నువ్వేమి చేశావు పాపం..!



చైల్డ్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద బాలికతో మహిళలు

మల్కన్‌గిరి: దివ్యాంగురాలైన ఆడబిడ్డ కుటుంబానికి బరువు అనుకున్నారేమో అడవిలో వదిలి వెళ్లారు. ప్రపంచం తెలియని ఆ చిన్నారి బిక్కుబిక్కుమంటూ చెట్ల మధ్య నిద్రపోతూ కనిపించిన ఘటన పలువురిని కంటతడి పెట్టించింది. నవ మాసాలు మోసిన తల్లిదండ్రులకు అడవిలో వదిలేయడానికి మనస్సు ఎలా వచ్చిందోనని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి నక్కమామ్ముడి పంచాయతీ డైక్ 3 గ్రామం వద్ద అడవిలో ఒక దివ్యాంగ బాలిక ఇద్దరు మహిళలకు గత బుధవారం దొరికింది. ఆ బాలికను మల్కన్‌గిరి చైల్డ్ వెల్ఫేర్‌కు వారికి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. డైక్ 3 గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు మంగూళీ మాఝి, శుక్రీ హంతాల్‌లు చేపల వేటకు వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా సమీప అడవిలో దాదాపు 9 ఏళ్ల వయస్సు కలిగిన ఒక దివ్యాంగ బాలిక అడవిలో నిద్రపోతూ కన్పించింది. దీంతో వారు ఆమె దగ్గరకు వెళ్లగా వారిని చూస్తూ భయపడింది. ఆ బాలికకు వినిపించడం, మాట్లాడడం రావడం లేదు. దీంతో ఆ బాలికను ఎవరో తీసుకొచ్చి ఇక్కడ విడిచిపెట్టారని నిర్ధారించుకున్న మహిళలు తమతో పాటు తీసుకొని బలిమెల పోలీసుస్టేషన్‌కు వెళ్లి విషయం తెలియజేశారు. అయితే సోమవారం గ్రీవెన్స్ వరకు బాలిక సంరక్షణ చూడమని అక్కడి వారు చెప్పడంతో బాలికను జాగ్రత్తగా చూసుకున్నారు. అనంతరం ఇటీవల సోమవారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో చిత్రకొండ సమితిలో కలెక్టర్ సచిన్ పవార్ వద్దకు తీసుకొచ్చి విషయాన్ని తెలియజేశారు. దీంతో కలెక్టర్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి నారాయణ దాస్‌తో మాట్లాడి బాలికను సంరక్షణ కేంద్రంలో చేర్చుకున్నారు. బాలికను చక్కగా చూసుకున్న మహిళలకు కలెక్టర్ సచిన్ అభినందించారు.

పొగాకుతో అనారోగ్య సమస్యలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పొగాకుతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వక్తలు పేర్కొన్నారు. స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్‌లో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని మంగళవారం జరుపుకున్నారు. పొగాకు వలన సంభవించే దుష్పరిణామాలపై జిల్లా అదనపు పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డా.ఇందిరా మహాపాత్రో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గుట్కా వినియోగంతో కలిగే అనర్థాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాజన్ మోలాస్ ప్రథమ స్థానంలో, రోషిణి చౌదరి ద్వితీయ స్థానంలో, ధీరజ్ బోడోరయితో తృతీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో గురండి పీహెచ్‌ఈవో మమతా పాఢి, సంపాదకుడు భాగవత్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో జాలరి మృతి



ధనుర్జయ మృతదేహం వెలికితీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొరాపుట్: రిజర్వాయర్‌లో పడి జాలరి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి చందాలయగుడ గ్రామానికి చెందిన ధనుర్జయ సిసా (30) అనే జాలరి చేపలు పట్టడానికి కొలాబ్ రిజర్వాయర్‌కి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోయేసరికి గ్రామస్తులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రిజర్వాయర్‌కి ఒక ఒడ్డున అతని బైక్, చెప్పులు ఉన్నాయి. రిజర్వాయర్ మధ్యలో పడవ మీద ఉండి చేపలు పట్టడం తాము చూశామని కొందరు చెప్పారు. దీంతో నందపూర్ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. లమ్తాపుట్, నందపూర్ అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి ధనుర్జయ మృతదేహాన్ని రిజర్వాయర్ నుంచి వెలికితీశారు. నందపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటళ్లలపై అధికారుల దాడులు



హోటళ్లలో తనిఖీ చేస్తున్న అధికారులు

జయపురం: పట్టణంలోని పలు హోటళ్లపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ఆహార పదార్థాలు, పాచిన మిఠాయి, వండేందుకు ఉంచిన కాలం చెల్లిన వస్తువులను పరిశీలించి వాటిని పారవేశారు.అలాగే పలు హోటళ్లలో వినియోగిస్తున్న పాలిథిన్ సంచులను సీజ్ చేశారు. 17 హోటళ్లను తనిఖీ చేసిన అధికారులు వారి నుంచి రూ.36 వేలు జరిమానాగా వసూలు చేశారు. కొద్ది రోజుల్లో రథయాత్ర ఉండడంతో దాడులు ముమ్మరం చేసినట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాస్ కుమార్ వెల్లడించారు. దాడుల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ భవానీ హల్దు, సత్యనారాయణ పాత్రో, శానిటరీ టెక్నీషియన్ ఎ.రాజకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



బమునిగాం జమీపంలో చెట్టును ఢీకొన్న కారు



చందన్ కుమార్(ఫైల్)

జయపురం: విజయవాడ-రాంచీ 326 జాతీయ కారిడార్ మార్గంలోని జయపురం – మల్కన్‌గిరి మధ్యనున్న బమునీగాం గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక కారు అదుపుతప్పి రోడ్డు పక్కననున్న చెట్టును ఢీకొనడంతో ఒక యువకుడు దుర్మరణం చెందాడు. మృతి చెందిన వ్యక్తి జయపురం రాజువీధికి చెందిన చందన కుమార్ మహంతి(26)గా సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి వెల్లడించారు. ప్రమాద సమాచారం అందిన సదర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన చందన్‌ను ఆస్పత్రికి తరలించారు. అయితే అతను అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చందన్ కుమార్ ఏదోపనిపై పాత్రోపుట్ గ్రామానికి వెళ్లి రాత్రి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సృజనాత్మక విన్నపం



ఐస్‌క్రీం పుడకలతో రూపుదిద్దుకున్న కళాకృతి

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రత్న భాండాగారం తెరవాలని యువ కళాకారుడు రాష్ట్ర ప్రభుత్వానికి సృజనాత్మకంగా విన్నవించాడు. బీటెక్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ 3వ సంవత్సరం విద్యార్థి బిశ్వజిత్ నాయక్ వినియోగించని 475 ఐస్ క్రీం పుడకలతో ఆకర్షణీయమైన కళాఖండాన్ని రూపొందించాడు. దీనిలో రత్నవైఢూర్య ఖజానాతో శ్రీజగన్నాథుడిని తీర్చిదిద్దాడు. స్వామి రత్ననిధి, ఖజానా అత్యంత భద్రంగా తరతరాలు కొనసాగేలా చర్యలు చేపట్టాలని అభ్యర్థించాడు. దీర్ఘకాలంగా స్వామి భక్తులు రత్న భాండాగారంలో సొత్తు వివరాల కోసం నిరీక్షిస్తున్నారు. వారందరి తరపున ప్రభుత్వ దృష్టిని ఆకట్టుకునేందుకు ఈ కళాఖండం ఆవిష్కరించినట్లు పేర్కొన్నాడు. ఈ కళాకృతిని పూర్తి చేయడానికి 3 రోజులు పట్టిందని, దీని ఎత్తు 8 అంగుళాలు, వెడల్పు 20 అంగుళాలు ఉంటుందని వివరించాడు.

అభాగ్యుల కోసమే ప్రచేష్టా పథకం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రైతా పక్కనే డాక్టర్ రౌత్రాయ్, ప్రధాన్‌లు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాయగడ: తల్లిదండ్రుల ఆదరణకు కరువై రోడ్లపై అభాగ్యులుగా తిరిగే పిల్లలను అక్కున చేర్చుకొని, వారికి బంగారు భవిష్యత్ అందించాలని ఉద్దేశంతో కొనసాగుతున్నదే ప్రచేష్టా పథకమని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరైతా అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభాగ్యులైన పిల్లలను ఆదుకునే ప్రక్రియలో భాగంగా జిల్లా శిశు సంరక్షణ కేంద్రంలో ఇప్పటికే 98 మంది చిన్నారులు ఉన్నారని, వారిలో నలుగురిని జిల్లా యంత్రాంగం దత్తత ఇచ్చినట్లు తెలియజేశారు. వీరి సంరక్షణ, ఆలనాపాలనా, పోషణ కోసం ప్రభుత్వం ఒకొక్కరికీ నెలకు రూ.4 వేలు మంజూరు చేస్తోందని వివరించారు. బాల కార్మికులు, అనాథలైన 18 ఏళ్లలోపు 1653 మందిని యంత్రాంగం చేరదీసి వసతి గృహాల్లో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 200 గ్రామాల్లో శిశు సంరక్షణ కమిటీలు ఏర్పాటైనట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, జిల్లా శిశు సంరక్షణ అధికారి విచిత్ర శెఠి, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్ తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్ నుంచి పూరీకి సైకిల్ యాత్ర



సురేంద్ర ముదలి, బబులా ముదలిలకు స్వాగతం పలుకుతున్న దమంజోడి యువకులు



సురేంద్ర ముదలి

కొరాపుట్: జిల్లా నుంచి పూరీ క్షేత్రానికి లమ్తాపుట్ సమితికి చెందిన సురేంద్ర ముదలి అనే యువకుడు సైకిల్ యాత్ర బుధవారం ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రచారం చేస్తూ ముందుకు సాగాడు. గతంలో సురేంద్ర కొరాపుట్ జిల్లా నుంచి కేదార్‌నాథ్‌కి విజయవంతంగా సైకిల్ యాత్ర చేశాడు. ఈ నేపథ్యంలో ఈ యాత్రకు శ్రీకారం చుట్టారు. తొలిరోజు జయపూర్, సిమిలిగుడల మీదుగా దమంజోడి చేరుకున్నాడు. దమంజోడిలో ఐకాన్ కొరాపుటియా సోనా సోని యువజన సంఘం సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వారంతా కలిసి అక్కడ చెట్లు నాటారు. ఈ విడత సురేంద్రతో బబులా ముదలి కూడా సైకిల్ యాత్రలో జత కలిశాడు. వీరికి దమంజోడిలో మహావీర్ యుత్ అసోసియేషన్ అనే పర్యావరణ పరిరక్షణ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం సైకిలిస్టులు కక్కిరిగుమ్మ చేరుకున్నారు. అక్కడి నుంచి రాయగడ జిల్లా మీదుగా పూరీ వెళ్లనున్నారు.

క్లుప్తంగా

ఆయుధాగారం పరిశీలన



ఆయుధాలను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ జైన్

భువనేశ్వర్: నయాగడ్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ జైన్ నయాగడ్ జిల్లా ఆయుధాగారాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి మరియు ఇతర అనుబంధ పరికరాల నిర్వహణ శైలిని పరిశీలించారు. ఆయుధ పరికరాల నిర్వహణలో నిర్ధారిత నిర్వహణ విధానాల (ఎస్‌ఓపీ) ప్రాముఖ్యతను అనుబంధ సిబ్బందికి వివరించారు. ఈ నియమావళి ప్రకారం ఆయుధాల నిర్వహణ నిర్ధారిత శైలిలో క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. ఆయనతో పాటు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, సార్జెంట్, ఆయుధాగారం హవల్దార్ ఉన్నారు.

నూతన సీఈవోగా తిరుమల నాయక్



సీఈవో తిరుమల నాయక్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

భువనేశ్వర్: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా డాక్టర్ ఎస్.తిరుమలనాయక్ నియమితులయ్యారు. ఇంతకుముందు ఆయన అదనపు ప్రధాన ఎన్నికల అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. బుధవారం ఆయన సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని సీనియర్ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరణ పురస్కరించుకుని భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై తోటి అధికారులతో స్వల్పంగా చర్చించినట్లు తెలిపారు.

గాయపడిన కార్మికుడు మృతి

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పారిశ్రామికవాడలో శ్రేయాస్ పరిశ్రమలో మంగళవారం సాయంత్రం ఉప్పు నిల్వ చేసే గోదాం పైన పని చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి షమీమ్ షేక్‌తో పాటు కార్మికుడు రకిబుల్ షేక్ (23) అనే కార్మికుడు పడిపోయాడని జె.ఆర్.పురం పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో షమీమ్ షేక్ మంగళవారమే మృతి చెందగా.. రకిబుల్ షేక్ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఇద్దరూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నదియా జిల్లా భౌరు గ్రామానికి చెందినవారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జె.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావు తెలిపారు. విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో శవపంచనామా పూర్తిచేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రైవేటు పాఠశాలలో పుస్తకాల గది సీజ్

కోటబొమ్మాళి: మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ పరిధిలోని ఆదిత్యా ప్రైవేటు హైస్కూల్‌లో అధిక ధరలకు విద్యార్థులకు నోట్ పుస్తకాలు అమ్ముతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.చందు బుధవారం కోటబొమ్మాళి విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంఈఓ ఎస్.అప్పలరాజుకు సంబంధిత స్కూల్‌కు వెళ్లి పుస్తకాలు నిల్వ చేసిన గదిని సీజ్ చేశారు. పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు చేపడతామని తెలిపారు.

మోహన్‌దాస్‌కు సత్కారం

పాతపట్నం: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 69వ ఆవిర్భావ వేడుకలు ఇటీవల ముంబైలో ఘనంగా జరిగాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి పాతపట్నం ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ పెద్దింటి మోహన్‌దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో 17 సర్కిల్స్ నుంచి 24 మంది మేనేజర్లు బ్యాంక్ డే వేడుకల్లో పాల్గొన్నారని, అందులో మన రాష్ట్రం నుంచి తాను హాజరైనట్లు తెలిపారు. అక్కడి ఉన్నతాధికారులు అభినందించి సత్కరించారని చెప్పారు. అనంతరం మోహన్‌దాస్‌ను స్థానిక సిబ్బంది అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సోంపేట: మండలంలోని ఎం.జీ.పురం పంచాయతీ బాతుపురం వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని బుధవారం మృతి చెందినట్లు బారువ ఎస్ఐ చంద్రశేఖరరావు తెలిపారు. మృతుడి వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు.

మట్టి ట్రాక్టర్ల సీజ్

కాశీబుగ్గ : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 3వ వార్డు జయ రామచంద్రపురంలో బుధవారం అక్రమంగా మట్టితవ్వకాలు జరుపుతున్న మూడు ట్రాక్టర్లను అధికారులు సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా రియల్ వెంచర్లకు వందల సంఖ్యలో మట్టి లోడ్లను ట్రాక్టర్లతో తరలించడంతో రెవెన్యూ అధికారులకు సమాచారం చేరింది. వెంటనే పలాస తహశీల్దారు ఎస్ఎస్‌వీఎస్ నాయుడు ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్లను సీజ్ చేశారు.



రాయగడ: మొక్కలు నాటుతున్న దృశ్యం



కొరాపుట్: వనయజ్ఞంలో పాల్గొన్న కలెక్టర్ కమలోచన్ మిశ్ర తదితరులు



పర్లాకిమిడి: మొక్క నాటుతున్న డీఎఫ్‌వో ఆనంద్

మొక్కలతోనే జీవకోటికి మనుగడ

- నబరంగ్‌పూర్ కలెక్టర్ కమలోచన్

కొరాపుట్: మొక్కలతోనే జీవకోటికి మనుగడ సాధ్యమవుతోందని నబరంగ్‌పూర్ కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర అన్నారు. నందాహండి సమితి బరిగుడ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన వన యజ్ఞంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో జిల్లాలో 8 లక్షల మొక్కలు నాటే లక్ష్యం పూర్తి చేద్దామని పిలుపునిచ్చారు. అందులో రెండు లక్షల మొక్కలు సంరక్షించే బాధ్యత స్వయం సహాయక బృందాలకు అప్పగిస్తామని తెలిపారు. గ్లోబల్ వార్మింగ్ దృష్ట్యా ప్రతీ వ్యక్తిపై మొక్కలు నాటడంతో పాటు సంరక్షించే బాధ్యత ఉందన్నారు. జిల్లాలోని ప్రతీ ప్రభుత్వ భవనం వద్ద మొక్కలు పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నందాహండి బీడీవో కిరోడ్ చరణ్ సాహు తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడిలో...

జిల్లాలోని బెత్తగుడ డీఈవో కార్యాలయం ప్రాంగణంలో డీఈవో మాయాధర్ సాహు, అదనపు జిల్లా శిక్షాధికారి మనోజ్ రంజన్ దొళాయి వన మహోత్సవాల వారోత్సవాలు సందర్భంగా మొక్కలు నాటారు. ఒక చెట్టు మన తల్లి పేరుపై అనే నినాదంతో ప్రతీ పాఠశాలలో మొక్కలను విరివిగా నాటాలన్నారు. అలాగే బెత్తగుడ కేంద్రీయ విద్యాలయం ఆవరణలో జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ ఆధ్వర్యంలో వన మహోత్సవాలు జరిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి, న్యాయసేవా ప్రాధికరణ అధ్యక్షుడు ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ విచ్చేసి విద్యాలయం ఆవరణలో మామిడి మొక్కను నాటారు. భావితరాల మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు ప్రతీ విద్యార్థి విద్యాలయం ఆవరణలో ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో ఎస్.ఆనంద్, దేవగిరి అటవీ రేంజ్ అధికారి బ్రహ్మానంద సాహు, ఫారెస్టర్ పి.వెంకటరమణ, సంతోష్ కుమార్ పోరిచ్చా, వన రక్షకుడు ప్రసాద్ నాయక్, పుష్పలతా పండా పాల్గొన్నారు.



పర్లాకిమిడి: బెత్తగుడ డీఈవో కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న సిబ్బంది

రాయగడలో...

జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ శంకరడ సంరక్షిత అడవుల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చుముకి మాఝి హాజరయ్యారు. సంరక్షిత అడవుల్లోని పది ఎకరాల విస్తీర్ణంలో ఈ ఏడాది వివిధ రకాల మొక్కలను నాటేందుకు శ్రీకారం చుట్టామని అటవీ శాఖ రేంజర్ అనిల్ కుమార్ పాణిగ్రాహి అన్నారు. దీనిలో భాగంగా మొదటి పర్యాయంగా 16 వందల మొక్కలను నాటే కార్యక్రమానికి పంచాయతీలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు హాజరయ్యారు.



పర్లాకిమిడి: మొక్క నాటి నీరుపోస్తున్న జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్

కరాటే విజేతలకు అభినందనలు



విజేత జట్లుతో డీజీపీ షడంగి, ఇతర ఉన్నతాధికారులు

భువనేశ్వర్: అస్సాం గౌహతిలో జరిగిన 9వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్ – 2024లో పలు పతకాలు సాధించిన ఒడిశా పోలీసు జట్టు క్రీడాకారులను రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అరుణ్ కుమార్ షడంగి ప్రత్యేకంగా అభినందించారు. ఈ పోటీల్లో రాష్ట్ర పోలీసు కరాటే మరియు పెన్‌కాక్ సిలాట్ జట్టు 5 స్వర్ణాలు, 5 రజతాలు మరియు 6 కాంస్య పతకాలను గెలుచుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఈ స్ఫూర్తిని కొనసాగించి ఒడిశా పోలీసులకు మరింత కీర్తిని తీసుకురావాలని డీజీపీ విజేత బృందానికి ఉద్బోధించారు.

‘సమస్యలు పరిష్కరించండి’



మంత్రి ముఖేష్ మహాలింగ్‌తో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, కనుదాస్‌లు

కొరాపుట్: తన నియోజకవర్గంలోని వైద్య సంబంధిత సమస్యలు పరిష్కరించాలని నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి రాష్ట్ర వైద్యశాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్‌ని విజ్ఞప్తి చేశారు. బుధవారం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో మంత్రిని అతని చాంబర్‌లో కలిశారు. వెనుకబడిన నబరంగ్‌పూర్ జిల్లాలో వైద్యులు లేకపోవడంతో గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా వైద్య సదుపాయాలు లేవన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ఈ సమస్యలు అధికంగా ఉంటున్నాయన్నారు. మౌలిక వసతులతో ప్రజలకు వైద్యం అందేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి తగిన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు నబరంగ్‌పూర్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కనుదాస్‌లు ఉన్నారు.

● గవర్నర్‌తో స్పీకర్ భేటీ



రాష్ట్ర శాసనసభ స్పీకర్ సురమా పాఢి రాజ్‌భవన్‌లో గవర్నర్ రఘుబర దాస్‌ని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. – భువనేశ్వర్

కన్నవారికి కడుపుకోత

- ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి
- గతేడాదే సోదరుడు ఆత్మహత్య
- పెద్ద తామరాపల్లిలో విషాదఛాయలు

టెక్కలి రూరల్ : గత ఏడాది పెద్ద కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో ఆ బాధను మరిచిపోలేక కుమిలిపోతున్న ఆ తల్లిదండ్రులకు ఇప్పుడు చిన్న కుమారుడు కూడా దూరమయ్యాడు. ట్రాక్టర్ ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. నందిగాం మండలం పెద్దతామరాపల్లి గ్రామానికి చెందిన పోలాకి వంశి(27) తన గ్రామం సమీపంలోని టెక్కలి మండలం కొండభీంపురం వద్ద బుధవారం ట్రాక్టర్‌తో పొలంలో మట్టిని తరలించే పనికి వెళ్లాడు. సమీపంలోని జాతీయ రహదారిపైకి ట్రాక్టర్‌ను ఎక్కించే క్రమంలో వంశధార పిల్లకాలువ దాటుతుండగా ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపు తిప్ప ఇంజిన్ భాగంగా కాలువలో బోల్తాపడింది. ఈ ఘటనలో వంశి ఇంజిన్ కింద ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు, హైవే అంబులెన్స్ సిబ్బంది బయటకు తీసి టెక్కలి జిల్లాఆసుపత్రికి తరలించారు. అప్పటికే వంశీ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. టెక్కలి ఎస్ఐ-2 వి.వెంకటేశ్వరరావు వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మృతదేహానికి శవపంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు పోలాకి తిరుపతిరావు, బుద్ధమ్మ దంపతులకు రెండో కుమారుడు. గత ఏడాది పెద్దకుమారుడు మధు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ బాధ మరువక ముందే రెండో కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది.





కాలువలో పడిన ట్రాక్టర్ (ఇన్‌సెట్లో) వంశీ(ఫైల్)

‘రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి’

పర్లాకిమిడి: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ యువమోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ భవనం వద్ద రాహుల్‌గాంధీ చిత్రపటాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు బాలకృష్ణ పాత్రో, కౌన్సిలర్ బిభూతి భూషన్ బెహరా, సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో, ఈ.ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు దివాకర్ పాల్గొన్నారు.

కొరాపుట్: పార్లమెంట్‌లో విపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ నిరసన వ్యక్తం చేసింది. ఈ మేరకు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట బీజేపీకి చెందిన అనుబంధ యువమోర్చా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. హిందూ మతాన్ని రాహుల్ కించపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రాహుల్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన దిష్టి బొమ్మని దగ్ధం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కును నాయక్, పార్టీ నాయకులు ఎ.సతీష్, దేవదాస్ మహంకుడో, శ్రీధర్ పాత్రో, మమతా మహారణ, మినతి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: కాంగ్రెస్ భవనం వద్ద నిరసన తెలుపుతున్న యువమోర్చా నాయకులు



కొరాపుట్: నిరసన ర్యాలీ చేపడుతున్న యువమోర్చా కార్యకర్తలు



పర్లాకిమిడి: రాహుల్‌గాంధీ చిత్రపటాన్ని దహనం చేస్తున్న దృశ్యం

అక్రమ లే అవుట్ తొలగింపు

కాశీబుగ్గ : పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో అక్రమ రియల్ ఎస్టేట్ వెంచర్లపై అధికారులు చర్యలు చేపడుతున్నారు. మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖ అనుమతులు లేకుండా వేసిన వెంచర్లను గుర్తిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 7వ వార్డు చినబడాం, గోపాలపురం గ్రామాల మధ్య పంట భూములలో వేసిన లేఅవుట్‌ను అధికారులు పరిశీలించారు. పాత జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న లే అవుట్‌ను తొలగించారు. మున్సిపల్ జేసీబీతో బీటీ రోడ్లు, కంచె స్తంభాలు, డివైడర్లను తొలగించారు. సర్వే నంబర్ 71/03 లో సుమారు రెండు ఎకరాల అరవై సెంట్ల స్థలంలో ఈ లే అవుట్‌ను వేసినట్లు గుర్తించారు. పలాస ఆర్డీఓ భరత్ నాయక్ ఆదేశాలతో పలాస తహశీల్దారు ఎస్ఎస్‌వీఎస్ నాయుడు ఈ మేరకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో టీపీఓ అప్పలస్వామి, సిబ్బంది ప్రేమ్‌చంద్, గుప్తా, శ్రీనివాసరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చినబడంలో అక్రమ లేఅవుట్‌ను తొలగించిన మున్సిపల్ అధికారులు



నేరేడు పండు..

పోషకాలు మెండు



మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన నేరేడు పండ్లు

- ఆకు నుంచి బెరడు వరకు ఔషధ గుణాలు
- పండ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్
- సర్వరోగ నివారిణిగా ప్రసిద్ధి

వజ్రపుకొత్తూరు:

నేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. కాస్త వగరు, పులుపు, తీపి, కలబోతగా ఉండే వీటిలో పోషకాలు పుష్కలం. రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటు బీపీ, షుగర్, గుండె, కాలేయ సంబంధిత వ్యాధులు, సీజనల్ రోగాల నియంత్రణకు ఈ పండ్లు ఎంతగానో దోహదపడతాయి.

గ్రామాల్లో నేరేడు పండును సర్వరోగ నివారిణిగా భావిస్తారు. ప్రస్తుతం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా నేరేడు పండ్లు పుష్కలంగా కనిపిస్తున్నాయి. సీజన్లో మాత్రమే దొరికే పండ్లలో ఈ పండ్లకు చాలా ప్రాధాన్యత ఉంది. సీజనల్ వ్యాధులకు గురికాకుండా రోగనిరోధక శక్తి పెంచడంలో ఇవి బాగా పని చేస్తాయి. వీటిలో విటమిన్లు, పోషకాలు అధికంగా ఉంటాయి.

ఆరోగ్యానికి మేలు..



నేరేడు పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. శరీరంలో విష గుణాన్ని హరించే శక్తి వీటికి ఉంది. శస్త్రచికిత్సలు అందుబాటులో లేని రోజుల్లో వైద్యానికి నేరేడు బెరడు, కాయలు, ఆకులను ఎక్కువగా వినియోగించేవారు. మధుమేహం, రక్తహీనత, బీపీతో పాటు పలు దీర్ఘకాలిక వ్యాధులు నివారణకు ఇవి ఔషధాలుగా పని చేస్తాయి.

– డాక్టర్ కె.లీల, విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, టెక్కలి

హైబ్రిడ్ రకానికి గిరాకీ..

వర్షాకాలం ఆరంభం నుంచి నేరేడు పండ్లు సీజన్ మొదలవుతుంది. ప్రస్తుతం పట్టణాల్లో ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నాటు పండ్లు కంటే హైబ్రిడ్ (జంబో నేరేడు) రకానికి గిరాకీ ఎక్కువ. వీటి ధర కూడా ఎక్కువే. నాటు పండ్లు ప్రస్తుతం కిలో రూ.150 నుంచి రూ.170 వరకు ఉంటే హైబ్రిడ్ కిలో రూ. 200 నుంచి రూ.250 మధ్య విక్రయిస్తున్నారు. మధుమేహం, రక్త హీనత, బీపీ, కిడ్నీ సమస్యలతో పాటు అనేక దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమయ్యేవారు ఈ పండ్లను తింటే చాలా వరకు రోగాలను నియంత్రించుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు.

వీరికి వద్దు..

నేరేడు పండ్లు ఎక్కువగా తింటే బీపీ తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయి తగ్గుతుంది. శస్త్ర చికిత్స చేయించుకునే వారు వీటికి దూరంగా ఉండటమే మేలు. బీపీ సమస్య ఎక్కువగా ఉన్నవారు వీటిని ఎక్కువగా తినరాదు. ఖాళీ కడుపుతో నేరేడు పండ్లు అస్సలు తినరాదు. ఈ పండ్లను అధికంగా తింటే మొటిమలు వస్తాయి. చర్మసమస్యలు ఉన్నవారు తింటే అలర్జీలు పెరుగుతాయి.

ఉపయోగాలెన్నో..

- శరీర భాగాలకు గాయాలైతే నేరేడు ఆకులను కట్టుగా కడితే రక్తం కారకుండా నిలుపుదల చేయవచ్చు.
- మూత్రాశయ సమస్యలకు నేరేడు ఓ టానిక్‌లా పని చేస్తుంది. మూత్రం రాక ఇబ్బంది పడే వారికి ఇదొక దివ్యమైన ఔషధం.
- పొట్టలో ఉండే నులి పురుగులను నేరేడు నివారిస్తుంది.
- నోటి క్యాన్సర్ నివారణకు నేరేడు పండ్లు ఎంతగానో ఉపయోగపడతాయి.
- మధుమేహ బాధితులు నేరేడు గింజలను పొడిగా చేసుకుని రోజూ నీటిలో మరగబెట్టి, వడకట్టి తాగితే శరీరంలో చక్కెర నిల్వలు అదుపులో ఉంటాయి.
- నోటి పూత, చిగుళ్ల వ్యాధులు, దంతక్షయంతో బాధపడేవారు నేరేడు ఆకుల రసాన్ని పుక్కిలిస్తే ఉపశమనం కలుగుతుంది.
- నోటిపూత వచ్చినపుడు రెండు, మూడు నేరేడు పండ్లు తింటే వెంటనే మంట, బాధ నుంచి విముక్తి లభిస్తుంది.
- అతిసార రోగులకు సైతం ఈ పండ్లు ఔషధంలా పనిచేస్తాయి.

క్లుప్తంగా

రామతీర్థంలో చురుగ్గా ఫ్లోరింగ్ పనులు



దేవస్థానం వెలుపల ఫ్లోరింగ్ చేస్తున్న కార్మికులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన నిధులతో ఫ్లోరింగ్ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. దేవస్థానం వెలుపల అభివృద్ధి పనులు చేపట్టేందుకు గత ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో ఇప్పటికే శాశ్వత యాగశాల నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించారు. ప్రస్తుతం ఆలయం వెలుపల ఫ్లోరింగ్ పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు 80 శాతం పూర్తయినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పిచ్చికుక్క కరిచి ఇద్దరికిగాయాలు



కుక్క కరిచి సీహెచ్‌సీలో చికిత్సపొందుతున్న విద్యార్థి లోకేష్

బాడంగి: మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన దాసరి లోకేష్ అనే ఏడవ తరగతి విద్యార్థితోపాటు అదే గ్రామానికి చెందిన చింతాడ లక్ష్మిలు పిచ్చి కుక్క కరిచి గాయాల పాలవడంతో స్థానిక సీహెచ్‌సీలో బుధవారం చేరి చికిత్సపొందారు. విద్యార్థి లోకేష్ పెరుగు ప్యాకెట్‌కోసం వీధిలో బడ్డీకి వెళ్తుండగా కుక్క కాలుపై కరవడంతో నేలపై పడిపోగా ముఖంపై కూడా కుక్క గాయపరిచిందని బాలుడి తాత దాసరి సూర్యనారాయణ చెప్పారు. అదేగ్రామానికి చెందిన లక్ష్మి దినచర్యలో భాగంగా ఇల్లు తుడిచి వాకిలితుడవడానికి బయటకువచ్చి తుడుస్తుండగా చేతిపైన, ముక్కపైన కుక్క కరిచినట్లు గ్రామస్తులు చెప్పారు.వారిద్దర్నీ సీహెచ్‌సీలో చేర్పించగా డాక్టర్లు ఏంటీరేబిస్ ఇంజక్షన్లు ఇచ్చారు. గాయాలపై క్లీనింగ్‌చేసి ఆయింట్ మెంట్ పూశారు.

మల్లిపురానికి రావిశాస్త్రి పురస్కారం

పార్వతీపురంటౌన్: కథా రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి పేరిట ఏటా ఇచ్చే రావిశాస్త్రి పురస్కారం ఈ సారి పార్వతీపురానికి చెందిన గిరిజన కథా రచయిత మల్లిపురం జగదీశ్వర రావును వరించింది. ఈమేరకు నిర్వాహకుల నుంచి సమాచారం అందిందని ఆయన బుధవారం తెలిపారు. తాను రచించిన 'అడవి పూల దారిలో' పుస్తకం ఈ పురస్కారానికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 28న విశాఖపట్నంలో జరిగే సభలో అవార్డు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వర రావుకు కవి, రచయిత గంటేడ గౌరునాయుడు, కె.కె. కె. వర్మ, శ్రీని వాసరావు, ఎంవీఆర్ శర్మ, గోపాలరావు, పక్కి రవీంద్రనాథ్ తదితరులు అభినందనలు తెలిపారు.

పోక్సో కేసులో నిందితులకు జైలు, జరిమానా

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా దిశ మహిళా పోలీస్ స్టేషన్‌లో 2021లో నమోదైన పోక్సో కేసులో ముద్దాయిలకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు వెల్లడించారని దిశ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ బి.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. పూసపాటిరేగ మండలంలోని తిప్పలవలస గ్రామానికి చెందిన రాగితి సత్తియ్య, వాసుపల్లి కన్నయ్య అనే ఇద్దరు వ్యక్తులు 2021 ఆగస్టు 26న బాలికను అపహరించి, అసభ్యకరంగా ప్రవర్తించినట్లు దిశమహిళా పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదుచేయగా, అప్పటి ఎస్సై కేటీఆర్ లక్ష్మి పోక్సో కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టి, నిందితులను అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసులో ప్రాసిక్యూషన్ ప్రారంభం నుంచి దిశ పోలీసులు సాక్షులను, ఆధారాలను ప్రవేశపెట్టగా నేరారోపణ రుజువు కావడంతో స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి ప్రధాన నిందితుడు రాగితి సత్తియ్యకు మూడేళ్ల కఠిన కారాగారం, రూ.2,500 జరిమానా, వాసుపల్లి కన్నయ్యకు ఏడాది జైలు, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పువెల్లడించారు. ఈ కేసులో పోలీసుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

రాజాం సిటీ: మండల పరిధి చీకటిపేట జంక్షన్ వద్ద బుధవారం జరిపిన వాహన తనిఖీల్లో ఓ వ్యక్తి గంజాయితో పట్టుబడ్డాడని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాజాం పట్టణంలోని కూరాకుల వీధికి చెందిన జక్కం దీపక్ గంజాయికి బానిసయ్యాడు. తాను వినియోగించడమే కాకుండా తన అవసరాల నిమిత్తం ఇతరులకు విక్రయాలు చేపడుతున్నాడు. ఇందులో భాగంగానే ఒడిశా నుంచి గంజాయిని ఒమ్మి గ్రామం వైపు నుంచి రాజాం తీసుకువస్తున్నాడు. అనుమానం వచ్చి వాహనం తనిఖీ చేసి 2.045 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితుడిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపర్చామని ఎస్సై వివరించారు.

ఆస్పత్రి పనితీరుపై అసంతృప్తి

- పనితీరు మెరుగుపడకపోతే ఖబడ్దార్
- గరివిడి మండలం కోనూరులో కలెక్టర్ ఆకస్మిక పర్యటన
- పీహెచ్‌సీ, హైస్కూల్ పరిశీలన



పీహెచ్ నిర్వహణపై డీహెంఎంహెచ్‌ఓ, వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరు, నిర్వహణపై కలెక్టర్ డా.బిఆర్.అంబేద్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నెలరోజుల్లో వైద్యాధికారుల పనితీరు మెరుగుపరుచుకోవాలని, లేని పక్షంలో చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ మేరకు గరివిడి మండలంలోని కోనూరు గ్రామంలో బుధవారం ఆయన ఆకస్మిక పర్యటన చేసి గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఉన్నత పాఠశాలను సందర్శించారు. ముందుగా పీహెచ్‌సీని పరిశీలించి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ప్రసవాలు, ఓపీ, తనిఖీలు, మందుల సరఫరా, పరికరాల వినియోగం వంటి అంశాల్లోను, ఆరోగ్య కేంద్రం నిర్వహణలోను,వైద్యుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీలో ప్రసవాలు ఎందుకు జరగడం లేదని ఆరా తీయగా...గర్భిణులను ప్రోత్సహిస్తున్నా ప్రసవాలకు ఎవరూ ముందుకు రావడం లేదని,చీపురుపల్లి సీహెచ్‌సీకి వెళ్లి ప్రసవించేందుకు ఇష్టపడుతున్నారని వైద్యాధికారి వెంకటరమణమ్మ వివరణ ఇచ్చారు. ఇందుకు సంతృప్తి చెందని కలెక్టర్ నెలరోజుల్లో ఇక్కడ ప్రసవాలు నమోదు కావాలని, లేనిఎడల క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీహెచ్‌సీకి ఫిజియోథెరపీ కోసం సరఫరా చేసిన పరికరాలు దుమ్ము పట్టి ఉండడాన్ని గమనించి వాటిని ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నించారు. వినియోగంలోకి తీసుకు రావాలని సూచించారు. అదే విధంగా ఓపీ నమోదు రిజిస్టర్‌ను పరిశీలించి ఓపీ సంఖ్య ఎందుకు తక్కువగా ఉందని ప్రశ్నించారు.ఒక వైద్యుడు మాత్రమే ఓపీ ఎందుకు చూస్తున్నారని, ఇద్దరూ ఓపీ తనిఖీలు చేయాలని స్పష్టం చేశారు. ల్యాబొరేటరీని సందర్శించి అందులో ఏర్పాటు చేసిన అధునాతన పరికరాల వినియోగంపై ఆరా తీశారు. అనంతరం వివిధ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి ఏ అనారోగ్య సమస్యలతో వచ్చారని,అక్కడ అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు.



రోగులతో మాట్లాడి సమస్యను తెలుసుకుంటూ..



హైస్కూల్‌లో పిల్లల నైపుణ్యాన్ని పరీక్షిస్తూ..

హైస్కూల్ నిర్వహణపై సంతృప్తి

కోనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ముందుగా తరగతి గదిలోకి ప్రవేశించి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. బయాలజీ పాఠ్యపుస్తకంలో ఉన్న పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నించగా వారి నుంచి సంతృప్తికరంగా సమాధానాలు రావడంతో ఉపాధ్యాయుల బోధనపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ ప్రకారం రోజూ ఆయా ఆహార పదార్థాలు వండి పెడుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. వంటలు చేస్తున్న ప్రదేశానికి వెళ్లి బుదవారం మెనూ పరిశీలించి వంటలపై మూతలు వేసి ఉంచడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం కోసం కట్టెల పొయ్యిపై వంటలు చేయడాన్ని గమనించి గ్యాస్ పొయ్యి సరఫరా చేస్తామని, జిల్లా పౌరసరఫరాల అధికారిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ బి.శాంతి, డీఎంహెచ్‌ఓ డా.ఎస్‌వీ.భాస్కర రావు, మండలాధికారులు పాల్గొన్నారు.

బాధితులకు 118 మొబైల్స్ అందజేత



పోగొట్టుకున్న మొబైల్స్‌ను బాధితులకు అందజేస్తున్న సీఐ టీవీ.విజయకుమార్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొంతమంది పోగొట్టుకున్న 118 మొబైల్స్‌ను ట్రేస్ చేసి, బాధితులకు బుధవారం సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ వద్ద సోషల్ మీడియా సైబర్ సెల్ సీఐ టీవీ.విజయకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్‌లు పోయినట్లు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా వాటిని ట్రేస్ చేసేందుకు సైబర్ సెల్ పోలీసులు, సిబ్బంది నిరంతరం చర్యలు చేపడుతున్నారన్నారు. ఫిర్యాదుచేసిన కొద్దిరోజుల్లోనే 118 ఫోన్‌లను ట్రేస్ చేశామని తెలిపారు. బాధితులు పోగొట్టుకున్న మొబైల్స్‌పై ఫిర్యాదు చేయాలనుకుంటే సీఈఐఆర్. జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా, లేకుంటే నేరుగా స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని సూచించారు. కొందరు నేరస్తులు గంజాయి అక్రమ రవాణా, హత్యలు, ఇతర నేరాలు చేసేందుకు వినియోగించిన తర్వాత, ఆయా నేరాల నుంచి తప్పించుకునే క్రమంలో నేరస్తులు మొబైల్స్ పారేస్తారని, అటువంటి మొబైల్స్‌ను ఎవరైనా వాడినట్లయితే పోలీసులు, కోర్టుల నుంచి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. అందువల్ల దొరికిన మొబైల్స్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించడం మంచిదని హితవు పలికారు. పోగొట్టుకున్న మొబైల్స్‌ను చాలా తక్కువ వ్యవధిలోనే తిరిగి అప్పగించిన సైబర్ సెల్ పోలీసులకు, ఎస్పీకి బాధితులు కృతజ్ఞతలు తెలిపి, తమ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సైబర్ సెల్ ఎస్సైలు ప్రశాంత్ కుమార్, నసీమా బేగం, కానిస్టేబుల్స్ తిరుపతి, శ్రీనివాసరావు, రాజేష్, శిరీష ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యా యత్నం

గుమ్మలక్ష్మీపురం: మద్యం తాగొద్దని కుటుంబసభ్యులు మందలించడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యా యత్నం చేశాడు. కురుపాం మండలం గుంజరాడ గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన ఆరిక రవి నిత్యం మద్యం తాగుతుండడంతో కుటుంబీకులు తీవ్రంగా మందలించారు. దీంతో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పత్తి పంటలో వేసే మందును తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కొంత సేపటికి గమనించిన భార్య సీత, ఇతర కుటుంబసభ్యులు హుటాహుటిన గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు సేవలు అందించారు. పరిస్థితి మెరుగుపడకపోవడంతో మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురంలోని జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

నేడు విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలి

పార్వతీపురంటౌన్: దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టబోయే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ సభ్యుడు పి.రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం పార్వతీపురం పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో కలిసి బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌డీఏ) జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని, తీవ్రమైన అవకతవకలు, వ్యత్యాసాలతో, బాధ్యతారాహిత్యంతో పరీక్షలు నిర్వహించారని ఆరోపించారు. వెంటనే నీట్ పరీక్షను రద్దు చేయాలని నీట్ పరీక్షా లీకేజ్ తెరవెనుక కుంభకోణం, నీట్-పీజీ పరీక్షను 12గంటల ముందు వాయిదా వేయడం, యూజీసీ నెట్ పరీక్ష రద్దు చేయడం వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించాయన్నారు. నీట్ స్కాంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని, దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని ఉన్నత విద్య మాత్రమే కాకుండా పాఠశాల విద్య పరిస్థితి కూడా దారుణంగా ఉందన్నారు. బీజేపీ పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోతతో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

6న కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు

పార్వతీపురంటౌన్: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జూలై 6 వ తేదీన పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నామని పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఆర్.అమరేంద్ర కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పశు వైద్యశాలలు, ప్రాంతీయ పశువైద్యశాలలు, వెటర్నరీ పాలిక్లినిక్స్‌లో వెటర్నరీ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్స్ వద్ద ఉచితంగా టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల 70 వేల యాంటీ రేబిస్ టీకాలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 1962 ను లేదా దగ్గర్లోని పశువైద్యశాలలో గానీ, సమీప రైతు సేవా కేంద్రంలో గాని సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందాలి

- జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

విజయనగరం అర్బన్: అటల్ ఇన్నోవేషన్ మిషన్‌ను పూర్తిస్థాయిలో, మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ కోరారు. ఈ మేరకు జిల్లా స్థాయి ఏటీఎల్ సమీక్షా సమావేశం కలెక్టరేట్ సమావేశమందిరంలో బుధవారం జరిగింది. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సమావేశంలో అటల్ ఇన్నోవేషన్ మిషన్ గురించి వివరించారు. విద్యార్థులకు నూతన అభ్యాస విధానాలకోసం 2016లో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. దీనికోసం జిల్లాలో 42 పాఠశాలలను ఎంపిక చేశామని, వాటిలో 36 ప్రభుత్వ, 6 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు.

భర్తీ కాని డీసీపీయూ పోస్టులు

- 2023 నవంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చిన అధికారులు
- 23 పోస్టుల భర్తీకి 384 మంది దరఖాస్తు
- అధికారుల మీనమేషాలు
- ఆందోళనలో అభ్యర్థులు



స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయం

విజయనగరం ఫోర్ట్: జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ (ఐసీడీఎస్) పరిధిలో ఉన్న జిల్లా బాలల సంరక్షణ విభాగం (డీసీపీయూ), శిశు గృహ విభాగాల్లో పోస్టుల భర్తీలో ఆ శాఖ అధికారులు అలసత్వం వహిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తు న్నారు. పోస్టు కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆందోళనలో ఉన్నారు. స్త్రీ, శిశుసంక్షేమశాఖ అధికారుల అలసత్వం తమ పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నోటిఫికేషన్ ఇచ్చి ఏడు నెలలవుతున్నా పోస్టుల భర్తీ చేయకపోవడం పట్ల మండిపడుతున్నారు.

23 పోస్టులకు నోటిఫికేషన్

జిల్లాలో డీసీపీయూ, శిశు గృహాల్లో ఖాళీగా ఉన్న 23 పోస్టులకు 2023 నవంబర్ 30 వతేదీన అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేసే పోస్టులు 5, అవుట్‌సోర్సింగ్ పోస్టులు 9, పార్ట్‌టైమ్ పోస్టులు 9 ఉన్నాయి. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది 2023 డిసెంబర్ 11 వతేదీ వరకు ఇచ్చారు. దీంతో 23 పోస్టులకు గాను 384 మంది దరఖాస్తు చేసుకున్నారు.

భర్తీ చేయాల్సిన పోస్టులు

జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీయూ) పోస్టు -1, డేటా ఎంట్రీ ఆపరేటర్ 1, సోషల్ వర్కర్-1, స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్-2, కుక్ పోస్టులు 4, హౌస్‌కీపర్ పోస్టులు-2, హెల్పర్ కమ్ నైట్ వాచ్‌మన్ పోస్టులు 3, ఎడ్యుకేటర్ పోస్టులు 3, ఆర్ట్, క్రాఫ్ట్స్', మ్యూజిక్ టీచర్ పోస్టులు 3, అలాగే 3 పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్ పోస్టులు నోటిఫికేషన్ ఇచ్చారు.

ఆందోళనలో అభ్యర్థులు

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు నోటిఫికేషన్ ఇచ్చి ఇంతవరకు భర్తీ చేయకపోవడంపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. భర్తీ ఎప్పుడు చేస్తారని అడిగితే అధికారులు ఇదిగోఅదిగో అంటూ తీవ్ర జాప్యం చేశారని అభ్యర్థులు వాపోతున్నారు. ముఖ్యంగా మెరిట్‌లో ఉన్న అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు.

దరఖాస్తుల వివరాలు:

పోస్టు పేరు	దరఖాస్తుల సంఖ్య
డీసీపీయూ	80
డీఈఓ	127
సోషల్ వర్కర్	38
స్టోర్ కీపర్	50
కుక్	26
హౌస్‌కీపర్	16
నైట్‌వాచ్‌మన్	19
ఎడ్యుకేటర్	17
మ్యూజిక్ టీచర్	7
యోగాటీచర్	4

ఇంటర్వ్యూలు చేయాలి

దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. పోస్టుల భర్తీకి సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉంది. ఐసీడీఎస్ పీడీ సెలవులో ఉన్నారు. వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటారు.
విజయకుమారి, ఇన్‌చార్జి పీడీ, స్త్రీ, శిశు సంక్షేమశాఖ

ఆంగ్లభాషలో ప్రావీణ్యం తప్పనిసరి

- ఐరిష్ స్కాలర్ డేవిడ్ ఫాలన్



లెండి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డేవిడ్ ఫాలన్

డెంకాడ: విదేశాలలో విద్యావకాశం పొందడంలో ఆంగ్ల భాషలో ప్రావీణ్యం కీలక పాత్ర వహిస్తుందని ప్రఖ్యాత ఐరిష్ స్కాలర్ డేవిడ్ ఫాలన్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన లెండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలోని ఇంగ్లీష్ లాంగ్వేజ్ కమ్యూనికేషన్ స్కిల్స్ (ఈఎల్‌సీఎస్) ల్యాబ్‌లో ఇంగ్లీష్ ప్రావీణ్యం, విదేశ విద్యావకాశాలపై జరిగిన ఒకరోజు వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐర్లాండ్‌లోని సంస్థలపై ప్రత్యేకంగా ప్రాధాన్యం ఇస్తూ యూరప్‌లోని వివిధ విశ్వవిద్యాలయాల గురించి తన విస్తృత పరిజ్ఞానాన్ని పంచుకున్నారు. విద్యావిషయక విజయాన్ని సాధించడంలో, విదేశాల్లో విద్యావకాశాలను పొందడంలో బలమైన కమ్యూనికేషన్ నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరిస్తూ భారతదేశంలో విద్యార్థుల సంయమనాన్ని కొనియాడారు. 21 వ శతాబ్దంలో వస్తున్న మార్పులకు దీటుగా ఇంజినీరింగ్ విద్యావిధానం మారబోతుందని అందుకు తగినట్లుగా ఉన్నత విద్యను అభ్యసించాలని ఆయన చెప్పారు. అంతర్జాతీయంగా తమ అధ్యయనాలను కొనసాగించాలని కోరుకునే విద్యార్థులకు ఆయన ప్రావీణ్యం, అవగాహనను రంగరించి విలువైన మార్గదర్శకత్వం చేశారు. లియో గ్లోబల్ ఓవర్సీస్, వైజాగ్ డివిజన్ సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. లెండి ఇనిస్టిట్యూట్‌ల వైస్ ప్రిన్సిపాల్, సీనియర్ ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ హరిబాబు తమ్మినేని..డేవిడ్ ఫాలన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఈవో వైజాగ్ బ్రాంచ్ మేనేజర్ వాసవి కోన, అన్ని విభాగాధిపతులు పాల్గొనగా, శ్రావణి, జ్యోత్స్న, రేవతి, రెజ్వాన్, రాజా కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

హోటల్స్ తనిఖీ

- ముగ్గురు నిర్వాహలకులకు జరిమానా



హోటల్స్‌లో తనిఖీ నిర్వహిస్తున్న ప్రజారోగ్య విభాగం అధికారులు

విజయనగరం: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న హోటల్స్‌పై విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు జిల్లాకేంద్రం విజయనగరంలోని వివిధ హోటల్స్‌ను బుధవారం తనిఖీ చేసి మూడు హోటల్స్‌కు జరిమానా విధించారు. కాలువల్లో హోటల్ వ్యర్థాలను విడిచిపెడుతున్న కారణంగా ఒక హోటల్‌కు, వంటగది పరిశుభ్ర వాతావరణంలో లేకపోవడంతో మరో హోటల్‌కు, సింగిల్ యూస్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వినియోగిస్తున్నందుకు ఇంకో హోటల్ యాజమాన్యానికి జరిమానా విధించారు. తాజా ఆహార పదార్థాలను అందిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హోటల్స్, తినుబండారాల దుకాణ యజమానులకు కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి ఈ సందర్భంగా సూచించారు. హోటల్స్ పరిసర ప్రాంతాలు, వంటగదులను, అందిస్తున్న ఆహార పదార్థాలను తనిఖీలో భాగంగా పరిశీలించారు. ప్రజారోగ్యానికి విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అనంతరం హోటల్స్ యజమాలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశాల మేరకు నగరంలో వివిధ హోటల్స్‌ను తనిఖీ చేశామన్నారు. బ్యాక్టీరియా, ఇతర సంక్రమిత వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకోవాలని, ముఖ్యంగా తినుబండారాలు తాజాగా ఉండాలని స్పష్టం చేశారు. అప్పుడే వండిన వేడివేడి పదార్థాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, రామకృష్ణ, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

7న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు



జిల్లాస్థాయి ఓపెన్ చెస్ టోర్నీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: ది విజయనగరం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ ఆదివారం విజయనగరం జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నామని టోర్నమెంట్ కమిటీ సభ్యుడు ఎస్.బంగారు బాబు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉదయం టోర్నమెంట్‌కు సంబంధించి ఆహ్వాన ప్రతులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాల్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పోటీలో పాల్గొనేందుకు ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని తెలియజేశారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఉడా కాలనీ బంగారమ్మ గుడి దగ్గరలో గల ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులతో పాటు 0-7,-0-9, 0-11,0-13, 0-15,0-17,0-19 వయస్సు గల గ్రూపులలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి బహుమతులు ఉంటాయన్నారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు పూర్తి వివరాల కోసం ఫోన్ 9100469919 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో టోర్నమెంట్ కమిటీ సభ్యులు ఈపు విజయ్ కుమార్, సముద్రాల గురుప్రసాద్, ఎస్‌వీఎస్ రామకృష్ణ, ఆర్‌వీ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

450మద్యం సీసాలు ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేయిస్తున్న ఎస్సై మహేష్

గజపతినగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంతవరకు 19కేసుల్లో పట్టుబడిన 450 మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పట్టుబడిన సీసాలను నేలమట్టం చేయిస్తూ ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం అక్రమ వ్యాపారాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టి వారి నుంచి స్వాధీనం చేసుకున్న సీసాలను ధ్వంసం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు కానిస్టేబుల్స్ ఉన్నారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోండి



ప్రీస్కూల్ చిన్నారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గౌరీశంకర్

కురుపాం: అంగన్‌వాడీ కేంద్రాల సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మొండెంఖల్ గ్రామ సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకర్ అన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న ప్రీస్కూల్ చిన్నారులకు బుధవారం ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ సేవలపై అవగాహన పెంచుకొని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రీస్కూల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సులోచన, జ్యోతి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

తోటపల్లి కాల్వగండి సందర్శన



అల్లుపాల్తేరువద్ద తోటపల్లి కాల్వకు పడిన గండిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బాడంగి: మండలంలోని అల్లుపాల్తేరు గ్రామానికి సమీపంలో వేగావతి నదిపై కట్టిన అక్విడెక్ట్ ప్రవేశంలో తోటపల్లి క్వాలకు పడిన గండిని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే.రంగారావు (బేబీనాయన) బుధవారం సందర్శించారు. ఆ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బొంతు త్రినాథనాయుడు, మరికొంతమంది రైతుల కోరికమేరకు ఆయన గండిపడిన ప్రదేశానికి వెళ్లి పరీక్షించారు. కాల్వ రక్షిత గోడకు పెద్దరంధ్రం పడడంతో దిగువప్రాంతానికి వెళ్లవలసిన సాగునీరు రోడ్డును కోరివేసి సమీపంలోని వేగావతి నదిలోకి వృథాగా పోతోందని రైతులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు చెప్పారు. దీనికి ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ రైతులకు సాగునీరు సమస్య లేకుండా ఈసీజన్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టేలా, సీజన్‌ముగిసి కాల్వలో నీరు పోయినతరువాత శాశ్వత పనులు చేపట్టేందుకు రైతులకు సాగునీరు అందేలా ఇసుకబస్తాలతో గండిని పూడ్చాలని ఎమ్మెల్యే బేబీనాయన అధికారులకు సూచించారు. అదేవిధంగా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ సందర్భనలో మాజీ ఎంపీపీ త్రినాథనాయుడుతో పాటు ఎంపీటీసీ యజ్ఞలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.